క్లుప్తంగా

ధర్మవరంలో 72 గంటల భజన



భజన చేస్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: భీష్మ ఏకాదశి 101 త్రయహ మహోత్సల్లో భాగంగా ధర్మవరంలోని రామ మందిరంలో 72 గంటల ప్రత్యేక భజన కార్యక్రమం శనివారం ప్రారంభించారు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు వరకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాలోని 13 ప్రముఖ భజన బృందాలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా దత్తక్షేత్ర వార్షికోత్సవం



అనఘా సమేత దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రం 27వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దత్తహోమం, దేవతామూర్తులకు అభిషేకాలు, సామూహిక అనఘా వ్రతాలు, గురుపాదుకా పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ జి.గోవిందరాజులు, సభ్యులు, జయలక్ష్మీ మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

బలరాంపురంలో సామూహిక అక్షరాభ్యాసాలు



అక్షరాభ్యాసానికి హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు

గార: మండలంలోని మత్స్యకార గ్రామమైన బలరాంపురంలో భీష్మ ఏకాదశి పురస్కరించుకొని శనివారం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. ఉపాధ్యాయులు కింతలి సత్యనారాయణ, అలుగు సత్యనారాయణ, యామిని, ప్రియదర్శిని, నీలమణి సమక్షంలో 15 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు, పలకలు, బలపాలు అందజేశారు.


మురపాకలో పారిశుద్ధ్య పనులు



చెత్తాచెదారాలు తొలగిస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక గ్రామంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలించారు. చెత్తా చెదారాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ఇచ్చిన చెత్త కుండీల్లోనే వేయాలని సర్పంచ్ ప్రతినిధి పెయ్యిల లక్ష్మణరావు గ్రామస్తులకు సూచించారు.

విద్యార్థులకు అభినందనలు



ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల 22 మంది విద్యార్థినులు ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీకి ఎంపికైనట్లు డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సంపాదించడం కష్టతరమైన ప్రస్తుత రోజుల్లో తమ కళాశాల నుంచి ఎంపిక కావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను శనివారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ప్లేస్‌మెంట్ అధికారి ఎల్.ప్రసాదరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 43 మంది హాజరుకాగా.. వైద్యులు గంగా ప్రియదర్శిని, ఉషారాణి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. అనంతరం శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారాన్ని అందజేశారు. ఈ సేవలో అల్లినగరం, చిలకపాలెం, లోలుగు, పీఎస్ కాలనీ హయతినగరం భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై..

చైతన్య గళం

- బుర్రకథలతో ఆకట్టుకుంటున్న పైల సింహాద్రినాయుడు బృందం
- మద్య నిషేధం, నిరక్షరాస్యత, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రదర్శనలు
- నాలుగు దశాబ్దాలుగా కళామ తల్లి సేవలో తరలిస్తున్న కళాకారులు





మద్య నిషేధంపై బుర్రకథ ప్రదర్శిస్తున్న సింహాద్రినాయుడు బృందం

టాలెంట్

జి.సిగడాం: కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసే వ్యసనాల్లో అగ్రస్థానం మద్యానిదే. ఎన్నో జీవితాలు రోడ్డున పడటానికి కారణమవుతున్న మద్యం మహమ్మారికి వ్యతిరేకంగా బుర్రకథలు ప్రదర్శిస్తూ జనాల్లో చైతన్యం కల్పిస్తున్నారు జి.సిగడాం మండలం మెట్టవలస గ్రామానికి చెందిన పైల సింహాద్రినాయుడు, ఎం.శ్రీలక్ష్మి బృందం. ప్రత్యేక కథను సిద్ధం చేసుకుని మద్యం వల్ల కలిగే అనర్థాలను అంతర్లీనంగా చెబుతూ ఆకట్టుకుంటున్నారు. ఒక్క మద్య నిషేధమే కాకుండా అక్షరాస్యత, ఇతర సామాజిక సమస్యలపైనా బుర్రకథలు ప్రదర్శిస్తున్నారు. వీటితో పాటు పౌరాణిక కథలను సైతం ప్రదర్శిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా వీరు కళామ తల్లి సేవలో తరిస్తున్నారు.

కళ్లకు కట్టినట్లుగా..

పైల సింహాద్రినాయుడు గత 40 ఏళ్లుగా బుర్రకథలు ప్రదర్శిస్తున్నారు. మల్లికార్జున బుర్రకథ బృందం పేరిట జట్టును ఏర్పాటు చేసి వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. అందులో 10వేల పైగా మద్య నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించినవే. మద్యం తాగితే ఆరోగ్యం, కుటుంబం ఎలా ప్రభావితమవుతాయి.. ఆస్తులు ఎలా కరిగిపోతాయి.. భార్య, బిడ్డల పరిస్థితి.. వంటి సమస్యలను మాటలు, రూపంలో అందరికీ అర్థమయ్యేలా చెబుతున్నారు. మరోవైపు గ్రామాల్లో నిరక్షరాస్యత నిర్మూలించేందుకు చక్కటి ప్రదర్శనలు ఇస్తున్నారు. విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయని, ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలంటూ చైతన్యం కల్పిస్తున్నారు. ఇవే కాక గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్యం మెరుగు వంటి సామాజిక అంశాలపైనా బుర్రకథలు ప్రదర్శిస్తూ అభినందనలు అందుకుంటున్నారు. ఈ ప్రదర్శనలకు గాను గతంలో ప్రభుత్వాలే కొంత ఆర్థిక సాయం అందించగా.. ప్రస్తుతం గ్రామ కమిటీలే ప్రత్యేకంగా వీరి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాయి.



పురస్కారం అందుకుంటున్న సింహాద్రినాయుడు(ఫైల్)

ఆనందంగా ఉంది



మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలను బుర్రకథల రూపంలో వివరిస్తున్నాను. మా ప్రదర్శన తిలకించి ఎంతోమంది మందు మానడం ఆనందంగా ఉంది. పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల వాడకం తదితర అంశాలపై ప్రదర్శనలు ఇస్తున్నాం. ఇటీవలే జాతీయ పురస్కారం కూడా అందుకున్నాను.

– పైల సింహాద్రినాయుడు, మల్లికార్జున బుర్రకథ బృందం, మెట్టవలస

ప్రోత్సహించాలి..



ప్రస్తుత స్మార్ట్‌ఫోన్ యుగంలో బుర్రకథలకు ఆదరణ తగ్గిపోతోంది. ముఖ్యంగా బుర్రకథలు, నాటకాలు వంటివి చూసేందుకు ఆసక్తి చూపడం లేదు. అయినా మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. వారికి ఆకట్టుకునేలా బుర్రకథలు ప్రదర్శిస్తూ సామాజిక అంశాలపై చైతన్యం తీసుకొస్తున్నాం.

– ఎం.శ్రీలక్ష్మి, బుర్రకథ కళాకారిణి

డీసీసీబీ కాలనీలో స్థల వివాదం



రిజర్వు స్థలంలో పాతేందుకు తీసుకొచ్చిన స్తంభాలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని డీసీసీబీ కాలనీ(నర్సుకాలనీ)లో శనివారం స్థల వివాదం నెలకొంది. వెంకటేశ్వర సన్నిధానం వెనుక ఖాళీగా ఉన్న రిజర్వు స్థలాన్ని కొందరు ఆక్రమించగా.. అదే కాలనీలో నివాసముంటున్న బిర్లంగి రామ్మోహన్, సనపల శ్రీనివాసరావు, అంపోలు సంతోష్, అంపోలు ప్రతాప్, మధుసూదనరావు తదితర కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఎల్‌పీ నంబర్ 155/88గా ఉన్న ఈ స్థలం మీదుగా 80 అడుగుల రోడ్డు వేసేందుకు అధికారులు అప్పట్లో ప్రతిపాదన చేసినట్లు కాలనీవాసులు అంటున్నారు. దీనిని కొందరు వ్యక్తులు శనివారం ఉదయం జేసీబీతో చదును చేస్తూ స్తంభాలు పాతడానికి ప్రయత్నించడంతో అడ్డుకున్నారు. అనంతరం శ్రీకాకుళం ఎమ్మెల్యేకు ఫోన్‌లో సమాచారం అందించగా ఆయన వెంటనే మున్సిపల్ కమిషనర్ ద్వారా సచివాలయ సిబ్బందిని పంపించారు. అయినప్పటికీ స్తంభాలు పాతేందుకు గోతులు తవ్వడంతో డయల్ 100కు ఫోన్‌చేయగా పోలీసులు చేరుకున్నారు. దీంతో పనులు ఆపి పరారయ్యారు.

కుంభమేళాకు బయల్దేరిన బస్సు



బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీ ఒకటో డిపో ఆధ్వర్యంలో శ్రీకాకుళం కాంప్లెక్సు నుంచి శనివారం రాత్రి కుంభమేళాకు ప్రత్యేక బస్సు బయలుదేరింది. ఒకటో డిపో మేనేజర్ అమరసింహుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల స్పందన మేరకు ఈ నెల 12న మరొక బస్సు బయలుదేరనుందని తెలిపారు. 7 రోజులు, 7 పుణ్యక్షేత్రాలు దర్శించుకునేలా యాత్రను రూపొందించామన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్‌ను రూ.9వేలుగా నిర్ణయించామని తెలిపారు. వివరాలకు 9959225609, 7382917289, 7382921647, 7382921810 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రెండవ డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం ఎం.పి.రావు, ప్రసాద్, సుమన్ పాల్గొన్నారు.

తులసమ్మకు ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల : లావేరు మండలం మురపాకలో శ్రీరామ మందిరం వద్ద తులసీ అమ్మవారికి ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

11న ముత్యాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో ముత్యాలమ్మ తల్లి ఆలయ 10వ వార్షికోత్సవం ఈ నెల 11న నిర్వహిస్తామని కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి నిజరూపదర్శనం, పంచామృతాలతో అభిషేకాలు, పసుపు కుంకుమలతో ముర్రాట్లు సమర్పణ వంటి పూజా కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొనాలని కోరారు.

బీజేపీ నేతల గెలుపు సంబరాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మ్యానియా, సుపరిపాలనకు ఢిల్లీ ఫలితాలే నిదర్శనంగా నిలుస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఏడురోడ్ల కూడలి వద్ద పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు పరికరాల పంపిణీ

జి.సిగడాం: రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు, ఏరియా మేనేజర్ తవిటినాయుడు ఆదేశాల మేరకు దుక్కిదున్న కుండా మొక్కజొన్న వేసే డబుల్ వీల్ మార్కర్స్ పరికరాలను శనివారం బాతువ గ్రామంలో రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు టంకాల మోహన్ రంగా, డబ్బాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి నిత్యాన్నదాన పథకానికి మాఘ శుద్ధ ఏకాదశి సందర్భంగా పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. ఆమదాలవలసకు చెందిన దివంగత పొడుగు వెంకటరమణ జ్ఞాపకార్థం పొడుగు రంగారావు రూ.1,00,116, ఎం.ప్రసాదరావు, సుధ దంపతులు రూ.లక్ష విరాళంగా ఈవో వై.భద్రాజీకి శనివారం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు



మొండేటివీధిలో వెంకన్న విగ్రహావిష్కరణ



మొండేటివీధిలో వేంకటేశ్వరస్వామికి అలంకరణ



నారాయణ తిరుమలలో స్వామివారి దర్శనం

భీష్మ ఏకాదశి పురస్కరించుకొని నగరంలోని పలు ఆలయాలలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు, సహస్ర నామ పారాయణలు అనంతరం స్వామికి హారతి ఇచ్చి ప్రసాదం పంపిణీ చేశారు. పలుచోట్ల స్వామివారిని ఊరేగించారు.

– శ్రీకాకుళం కల్చరల్



బ్యాంకర్స్ కాలనీలో స్వామివారికి అలంకరణ



దూసివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

అధ్వాన రోడ్డుతో అవస్థలు

జిల్లా కేంద్రంలోని కిమ్స్ రోడ్డులో వెంకటాపురం నుంచి యాతపేటకు వెళ్లే బీటీ రోడ్డు గోతులమయంగా మారింది. దుమ్ము ధూళి చెలరేగి వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు బాగుచేయాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)



షాక్ కొడుతున్న విద్యుత్ బాక్సులు

గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యుత్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి. కొందరు ఆకతాయిలు బాక్సులు ధ్వంసం చేయడంతో కొన్నిసార్లు అవి షాక్ కొడుతున్నాయి. రెండు రోజుల కిందట తొమ్మిదో తరగతి విద్యార్థికి సైతం ఇలాగే షాక్ కొట్టడంతో సమీప పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించారు.

– గార



వెలగని విద్యుత్ దీపాలు

జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు వెలగక వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్లు నుంచి కుశాలపురం బైపాస్ కూడలి వరకు రెండు వైపులా ఎల్ఈడీ లైట్లు వెలగటం లేదు. మరోవైపు దట్టంగా మంచు కురవటంతో వాహనాల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

– ఎచ్చెర్ల క్యాంపస్



దుర్గాదేవి ఆలయ ప్రతిష్టాపనోత్సవం

సంతవురిటి గ్రామంలో దుర్గాదేవి ఆలయం ప్రతిష్టాపన శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మహిళలు ముర్రాట్లతో ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు.

– జి.సిగడాం



యాత్రికుల సేవలో..



బోరవానిపేట సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అన్నదానం



పులిహోర పంపిణీ చేస్తున్న మండల విద్యుత్‌శాఖ సిబ్బంది



సతివాడ శివాలయం వద్ద భక్తులకు అన్నసమారాధన

గార: శాలిహుండం జాతరకు విచ్చేసిన భక్తులకు పలు గ్రామాల వద్ద అన్నదానాలు, మంచినీరు వంటివి స్థానికులు పంపిణీ చేశారు. శాలిహుండం గ్రామస్తులు సుమారు 7 వేల మందికి, పూసర్లపాడు గ్రామస్తులు 8 వేల మందికి అన్నదానం నిర్వహించారు. బోరవానిపేట సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేయగా.. గార మండల విద్యుత్ శాఖ ఉద్యోగులు వాటర్ ప్యాకెట్లు, పులిహోర పంపిణీ చేశారు. కొండపై ఆరంగిపేట యువత మంచినీటి ప్యాకెట్లు, ఉసిరి కాయలు అందజేయగా.. సతివాడ శివాలయం వద్ద గ్రామస్తులు నాలుగు వేల మందికి అన్నదానం నిర్వహించారు.

వృద్ధురాలిని ఆదుకున్న రెడ్‌క్రాస్

శ్రీకాకుళం కల్చరల్: ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన వృద్ధురాలు శనివారం చింతాడ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో గాయాలపాలయ్యారు. అదే సమయంలో అటుగా వెళుతున్న రెడ్‌క్రాస్ సిబ్బంది కె.సత్యనారాయణ, పవన్ కుమార్‌లు స్పందించి వృద్ధురాలికి ప్రథమ చికిత్స అందించారు. ఈమెతో పాటు ఉన్న మనవరాలికి కూడా సపర్యలు చేశారు. అనంతరం 108 అంబులెన్సులో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు.



ప్రథమ చికిత్స అందిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

గోశాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మొదలవలస చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న గోశాలల నిర్మాణంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనలు మేరకు కచ్చితంగా టెండర్లు పిలిచి గోశాలలు నిర్మించాలన్నారు. టెండర్లు పిలవకుండా కూటమి నాయకులకు పనులు అప్పగించటం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. సంతసీతారాంపురం సర్పంచ్ దుంప అప్పయ్యమ్మ మాట్లాడుతూ తమ గ్రామంలో టీడీపీ వర్గానికి మాత్రమే గోశాలలు మంజూరు చేస్తున్నారని, వైఎస్సార్ సీపీ వర్గీయుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవటం లేదన్నారు. సాగునీటి చర్చలో భాగంగా సభ్యులు నారాయణ పురం కుడికాలువ సమస్యను ప్రస్తావించారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీపాన హరిహరరావు, పరిపాలన అధికారి పీవీఎస్ రామ్మోహన్, సమావేశంలో ఉపాధి ఏపీఎం శోభాదేవి, సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.